ఓటుతోనే ఉజ్వల భవిత

- ఓటింగ్ శాతం పెంచడమే స్వీప్ లక్ష్యం
- ఎన్నికల విధుల్లో పీఓలు బాధ్యతగా వ్యవహరించాలి
- నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు
- ఎన్నికల అధికారిణి, జిల్లా కలెక్టర్ సృజన



పత్తికొండలో ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ సృజన, ఆర్డీఓ నీలపు రామలక్ష్మి తదితరులు

పత్తికొండ రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటుతోనే భవితకు చోటు లభిస్తుందని కర్నూలు జిల్లా ఎన్నికల అధికారిణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన అన్నారు. స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఓటు హక్కు సద్వినియోగంపై అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. పత్తికొండలో ఆర్డీఓ కార్యాలయం నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్సీసీ విద్యార్థులు, సీఆర్పీఎఫ్ జవాన్లు, యువకులతో కలిసి అంబేడ్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ.. ఓటర్లను చైతన్యవంతం చేసి గతంలో కంటే ఓటింగ్ శాతాన్ని పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తుంచుకోవాలన్నారు. జీరో వయొలెన్స్–నో ర్రైపోల్ నినాదంతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు, ప్రజలు అందుకు సహకరించాలని కోరారు. రానున్న సాధారణ ఎన్నికల్లో పౌరులందరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలన్నారు. ఓటరు స్వేచ్ఛకు భంగం కలగకుండా భరోసా ఇచ్చేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఎన్నికల నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి

పత్తికొండ–ఆదోని రోడ్డులోని గోపాల్ ప్లాజాలో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వీఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సాధారణ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ అవగాహన కల్పించారు. ఆర్డీఓ నీలపు రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో కలెక్టర్ సృజన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో పీఓలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నిర్లక్ష్యపు ధోరణి విడనాడి పోలింగ్ కేంద్రంలో విధుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. మే 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఈవీఎంల కనెక్టివిటీ, వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌కు వచ్చిన ఓటరుకు తమ ఓటు హక్కు లేదన్న విషయం ఎక్కడా కనిపించకుండా దరఖాస్తు డాక్యుమెంటేషన్ క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి వచ్చిన మార్పులను ప్రతిఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మే 12వ తేదీన అన్ని పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సామగ్రిని చేర్చేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తహసీల్దారు మాధవరావు, డిప్యూటీ తహసీల్దార్లు, సెక్టోరియల్, బూత్ లెవెల్ అధికారులు, ఎంసీసీ, ఎఫ్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, అకౌంటింగ్, సచివాలయ ఉద్యోగులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్



స్వీప్ ర్యాలీలో పాల్గొన్న సీఆర్పీఎఫ్ బలగాలు

క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



బనవాసిఫారం నర్సరీ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసిఫారంలో ఎన్ఆర్ఈజీఎస్ సెంట్రల్ నర్సరీ వద్ద రోడ్డుపై చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వాటర్‌షెడ్ పీఓ వలిబేగ్, కోర్సు డైరెక్టర్ సుజాతమ్మ, ఏపీఓ విజయమోహన్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్, నర్సరీ టీఏ వితేంద్రారెడ్డిలు పాల్గొన్నారు.

మారెమ్మవ్వ ఆలయంలో చోరీ



హుండీని పగులగొట్టిన దుండగులు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని మారెమ్మవ్వ ఆలయంలో సోమవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. రెండు హుండీలను పగులగొట్టి డబ్బులు, అమ్మవారివి కొప్రమీసాలు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఆలయానికి భక్తులు వెళ్లగా చోరీ జరిగిన విషయం వెలుగుచూసింది.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న శ్రీనివాసులు

మద్దికెర: స్థానిక పెద్ద మసీదులో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు మంగళవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ముస్లింలకు పవిత్ర మాసమైన రంజాన్ నెలలో ఉపవాస దీక్షలు చేస్తున్న వారికి మతాలకు అతీతంగా ఇఫ్తార్ విందు ఇవ్వడం మంచిదన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఐకమత్యానికి ప్రతీకగా పేర్కొన్నారు. పార్టీ మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజావలి, ముస్లిం పెద్దలు ఖలీల్, ముస్తాక్, హొన్నూర్ సాబ్, మోదీన్, చాంద్ నాయకులు కిట్టి, గోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

మద్దికెర: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందు జాగ్రత్తలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని బొమ్మనపల్లి, యడవలి, హంప గ్రామాలలో కేంద్ర బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెంట్రల్ ఫోర్స్, స్థానిక పోలీసులు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దికెర ఎస్ఐ రమేష్ బాబు మాట్లాడుతూ.. ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ గట్టి చర్యలు తీసుకుందన్నారు. ప్రతి ఒక్క ఓటరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ఠమైన చర్యలు చేపడతున్నామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.


గుండెపోటుతో వలంటీర్ మృతి



బోయ లక్ష్మన్న (ఫైల్)

దేవనకొండ: మండలంలోని పాలకుర్తి గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న బోయ లక్ష్మన్న (35) గుండెపోటుతో మంగళవారం మృతిచెందాడు. ఉదయం ఛాతినొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరుకు తీసుకెళ్లగా ఆస్పత్రిలో మృత్యువాత పడ్డాడు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. లక్ష్మన్న మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోండి



జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఆలూరు: ఆటో బోల్తాపడి మృతి చెందిన వ్యవసాయ కూలీల కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనను సీపీఎం జిల్లా నాయకులు నారాయణస్వామి, హనుమంతు, మండల సీపీఎం కార్యదర్శి షాకీర్ తదితరులు కోరారు. మంగళవారం ఆలూరు పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కూలీ పనులకు వెళ్లిన పేద కుటుంబాల వారు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని ఆ కుటుంబాలకు ఎక్స్‌గ్రేషి యా అందించి ఆదుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతు సంఘం నాయకులు ఈరన్న, మైనా, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

ఆలయ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభం

తుగ్గలి: మండల పరిధిలోని రోల్లపాడు తండాలో మారెమ్మ ఆలయ ప్రతిష్ఠ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ గుండు వేణుగోపాల శాస్త్రి (బెల్దోణ స్వామి) ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు గణపతి పూజ, గోపూజ, కలశస్థాపన తదితర పూజలు నిర్వహించారు. 4న ఆలయంలో మారెమ్మవ్వ దేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని తండావాసులు తెలిపారు. ఆలయ నిర్మాణ దాతలు ఊటకంటి మాధవమ్మ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్

మద్దికెర: ఆటోలు, బొలెరోలు, టాటా ఏస్‌లలో కూలీలను కెపాసిటీకి మించి తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామని ఎస్ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. మంగళవారం గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు మిరప కోతల కోసం లెక్కకు మించి కూలీలను తరలిస్తుండగా అడ్డుకుని వాహనాలను వెనక్కి పంపించివేశారు. వారు మాట్లాడుతూ.. లైసెన్సు లేని డ్రైవర్లు వాహనాలు నడపడం వల్ల, తగిన ఫిట్‌నెస్ లేని వాహనాలను తిప్పుతుండడంతో ప్రమాదాలు జరిగి మహిళలు మృతి చెందుతున్నారన్నారు. కెపాసిటీకి మించి ప్రయాణికులను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు



సర్పరాజాపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



పార్టీలో చేరిన కృష్ణగిరి కార్యకర్తలతో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే, పేదవాళ్ల అభివృద్ధితో పాటు అన్ని వర్గాలు సంతోషంగా ఉండాలంటే మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు 2 ఓట్లు (ఎంపీ, ఎమ్మెల్యే) వేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. ఆమె మంగళవారం మండల పరిధిలోని సర్పరాజాపురం (కొత్తూరు), నర్సాపురం, బోయనపల్లె, కలుగొట్ల గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు ఆమెకు హారతులు పట్టారు. ప్రతి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే అక్కాచెల్లెమ్మలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరించగా అక్కున చేర్చుకున్నారు. పూలమాలలతో ముంచెత్తారు. పార్టీ శ్రేణులు బాణసంచా పేలుస్తూ రెట్టింపు ఉత్సాహంతో పాల్గొన్నారు. కరపత్రాలు పంచారు. పలు కూడళ్లలో ఓపెన్‌టాప్ జీప్ నుంచి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యకు రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ కూటమి నాయకులు కల్లబొల్లి మాటలతో, మోసపూరిత హామీలతో వస్తే మోసపోవద్దన్నారు. వలంటీర్లు పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే తెచ్చిఇస్తుంటే ఓర్వలేక కుట్రలు పన్ని అడ్డుకుంటున్న చంద్రబాబును, టీడీపీ కూటమి నాయకులను చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. ఆయా గ్రామాలలో మిగిలిన సమస్యలను పరిష్కరిస్తానని హామీఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కంగాటి రామ్మోహన్ రెడ్డి, బొమ్మన రవిరెడ్డి, సుంకన్న, కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, నర్సాపురం కృష్ణారెడ్డి, బోయనపల్లె అశోక్ రెడ్డి, కలుగొట్ల జనార్దనరెడ్డి, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, సీతారామిరెడ్డి, భరత రెడ్డి, మద్దిలేటి, శివన్న, బాష, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

కృష్ణగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. కృష్ణగిరికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు మంగళవారం ఆ పార్టీని వీడి చెరుకులపాడులో ఎమ్మెల్యే శ్రీదేవి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరగా ఆమె పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదల అభివృద్ధి కోసం సీఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందాయన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ వైపు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో బోయ శేఖర్, గోమసాని రంగస్వామి, కమ్మరి నాగరాజు, కమ్మరి మధు, హరిప్రసాద్, బోయ చిన్నరాముడు తదితరులు ఉన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలోని ఆదోని–సిరుగుప్ప సరిహద్దు చెక్‌పోస్టును మంగళవారం రాత్రి ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, ట్రైనీ డీఎస్పీ ధీరజ్ తనిఖీ చేశారు. అటుగా వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. రూ.50 వేలకు మించి నగదును తరలించినట్లయితే ఆ మొత్తాన్ని సీజ్ చేస్తామని చెప్పారు. అలాగే మాదకద్రవ్యాలు తరలించరాదని, వాహనాల రికార్డులు తప్పనిసరిగా ఉండాలని, డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. తాలుకా సీఐ నిరంజన్‌రెడ్డి, ఇస్వి ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ శివ నారాయణస్వామి, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, సిబ్బంది

జగనన్న మాటిస్తే తిరుగుండదు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విరూపాక్షి

హొళగుంద: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న మాట ఇచ్చాడంటే ఆరు నూరైనా నెరవేరుస్తారని, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి.. మీ ఇంట్లో మంచి జరిగిఉంటేనే తనకు ఓటెయ్యాలని అడుగుతున్న నేత జగనన్న ఒక్కరే అని వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి అన్నారు. ఆయన మంగళవారం హొళగుందలోని శ్రీరాంనగర్ క్యాంపు, రాజా కాలనీ, బుడగ జంగాల కాలని, ఎస్సీ కాలనీ, బీసీ కొండ కాలనీలలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారితో మమేకం అయ్యారు. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. విరూపాక్షి మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందించారని, కులం, మతం, ప్రాంతం పార్టీలు చూడని నేత ఆయనొక్కడే అన్నారు. టీడీపీ వారికి కూడా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

హొళగుందలో పర్యటిస్తున్న విరూపాక్షి సమక్షంలో టీడీపీ మద్దతుదారులైన 100 కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి విరూపాక్షి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. 40 పద్మశాలి కుటుంబాలు, అయోధ్య నగర్‌కు చెందిన 30 వాల్మీకి కుటుంబాలు, ఈబీసీ కాలనీలో 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.

టీడీపీ మండల కన్వీనర్‌ను కలిసిన విరుపాక్షి

పర్యటనలో భాగంగా హొళగుందకు వచ్చిన విరూపాక్షి టీడీపీ మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్యను కలిసి ఆప్యాయంగా పలకరించారు. ఆయన విరూపాక్షికి పూలమాల వేసి సన్మానించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి వేసి గెలిపించాలని, ఎలాంటి సమస్య ఉన్నా తప్పక పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు షఫివుల్లా, ఈశా, మల్లికార్జున, కోగిలతోట శేషప్ప, హనుమప్ప, మల్లయ్య, ఎస్కే గిరి తదితరులు పాల్గొన్నారు.



హొళగుంద ఎస్సీ కాలనీలో ప్రచారం చేస్తున్న ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి

వలంటీర్ల సేవలను అడ్డుకోవడం దుర్మార్గం

ఆలూరు రూరల్: వలంటీర్ వ్యవస్థ ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న భయంతోనే చంద్రబాబు తన జేబు సంస్థ ద్వారా ఫిర్యాదు చేయించి ఇంటింటి పింఛన్ల పంపిణీకి బ్రేక్ వేయించారని విరూపాక్షి అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. ప్రతినెలా 1వ తేదీన తెల్లారకముందే వృద్ధులు, వికలాంగులకు, మంచానికే పరిమితమైన రోగుల గృహాలకు వెళ్లి ఠంచనుగా పింఛన్ అందిస్తున్నారని చెప్పారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వారిపై చంద్రబాబు కక్షగట్టి తన అనుకూల సంస్థ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేయించి అడ్డుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. టీడీపీ హయాంలో మాదిరిగా పింఛనుదారులను ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోవడం ఎవరితరం కాదని స్పష్టం చేశారు.

జగనన్నతోనే దూదేకులకు గుర్తింపు



మాట్లాడుతున్న నూర్‌బాషా/దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాజీ

వెల్దుర్తి(కృష్ణగిరి): రాష్ట్రవ్యాప్తంగా 158 నియోజకవర్గాలలో ఉన్న 25 లక్షల మంది దూదేకులంతా ఏకమై సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకుంటామని నూర్‌బాషా/దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏలూరు జిల్లా టంగుటూరుకు చెందిన షేక్ సయ్యద్ బాజీ (ఎస్ఎస్ బాజీ) స్పష్టం చేశారు. ఆయన మంగళవారం వెల్దుర్తి మండలం బోయనపల్లెలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేపట్టిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ సంఘం ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 20 ఏళ్లుగా తమ కులం గుర్తింపుకోసం పోరాటాలు చేస్తున్నామన్నారు. తమ గోడును విన్న సీఎం జగన్ గతనెల 12న దూదేకుల కులాన్ని ఎవరైనా అవహేళన చేసినా, చులకనగా మాట్లాడినా చట్టపరమైన చర్యలు తీసుకునేలా జీఓ జారీ చేశారన్నారు. తమ కులానికి గుర్తింపునిచ్చిన జగనన్నను మరోసారి గెలిపించుకునేందుకు దూదేకుల కులస్తుల్ని ఏకం చేస్తున్నామన్నారు. ఆ సంఘం పత్తికొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా మద్దికెర మండలానికి చెందిన పి.బషీర్‌అహ్మద్, మహిళా అధ్యక్షురాలిగా పి.షమీనాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దూదేకుల నాయకులు మట్టిపాటి బాషా, నసిరుద్దీన్, దస్తగిరి, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో దాడులు నిర్వహించి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం అవరణలో ఆయన మాట్లాడుతూ.. దైవందిన్నె గ్రామంలో తనిఖీలు చేపట్టి ఈడిగ ఉరుకుంద అనే వ్యక్తి అక్రమంగా కలిగి ఉన్న 576 (90 ఎంఎల్) ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 36 వేలు ఉంటుందన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. సర్కిల్ పరిధిలో ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసినా సెల్ నెంబర్ 94409 02579కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ సత్యనారాయణ, హెచ్‌సీ లింగప్రసాద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని బి.అగ్రహారం గ్రామంలో బెల్లపు భాస్కర్‌నాయుడు కర్ణాటక మద్యం అక్రమంగా తీసుకొచ్చి విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. గ్రామంలోని ములుగుందం రోడ్డులోని బ్రహ్మయ్య దేవాలయం వద్ద మంగళవారం ఉదయం నిందితుడిని అరెస్ట్ చేసి 30 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఆలూరు రూరల్: హాలహర్వి మండలం బిలేహాలు గ్రామంలో సెబ్ పోలీసులు సోదాలు నిర్వహించి బోయ రాధమ్మ అనే మహిళ నుంచి 4 బాక్సులు (384 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు) స్వాధీనం చేసుకుని నిందితురాలిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. సిబ్బంది శ్రీనివాసులు, విజయుడు, నాగరాజు, లక్ష్మిదేవి ఉన్నారు.



పట్టుబడిన మద్యంను చూపుతున్న సెబ్ సీఐ



హెబ్బటంలో స్వాధీనం చేసుకున్న మద్యం బాక్సులు

25 బాక్సుల మద్యం స్వాధీనం

హొళగుంద: మండలంలో కర్ణాటక మద్యం అమ్మకాలపై ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ పెద్దయ్యనాయుడు, సిబ్బంది మంగళవారం దాడులు చేపట్టారు. హెబ్బటం గ్రామంలో ఓ వ్యక్తి కర్ణాటక నుంచి ఆంధ్రాలోకి అక్రమంగా మద్యం ప్యాకెట్లు తెచ్చి కళ్లంలో నిల్వ చేసినట్లు గుర్తించారు. సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి 25 మద్యం బాక్సులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

గోరుముద్ద స్టాకు పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పంపిణీపై ఫిర్యాదులు రావడంతో మంగళవారం ఎంఈఓ–2 మధుసుదన్‌రాజు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించి గుడ్లు, చిక్కీలు, రాగిపిండి, బియ్యంను ఎప్పటికప్పుడు విద్యార్థులకు పంపిణీ చేయాలని హెచ్ఎంకు సూచించారు. గడువు తీరిన గుడ్లు, చిక్కీలు, రాగిపిండిని విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ఆర్ఏవీఎఫ్ సంఘ నాయకులు ఖాజ, కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాను పరిశీలించి వంట ఏజెన్సీ వారికి సూచనలిచ్చినట్లు ఎంఈఓ తెలిపారు.

గాయపడిన మహిళ మృతి



సావిత్రమ్మ (ఫైల్)

మద్దికెర: మద్దికెర శివార్లలో మార్చి 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సావిత్రమ్మ (65) చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గత నెల 31న మిరప పంట కోతలు చేపట్టేందుకు వాహనంలో దాదాపు 30 మంది మహిళా కూలీలు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మద్దికెర శివార్లలో వాహనం టైరు పేలి అదుపుతప్పి ప్రమాదానికి గురవడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం గుంతకల్లు, కర్నూలు తదితర ప్రాంతాలకు తీసుకెళ్లిన విషయం తెలిసిందే. వారిలో సావిత్రమ్మ కోలుకోలేక మృతి చెందింది.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్.కైరవాడి గ్రామంలో హంద్రీ నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. గోనెగండ్లలోని లక్ష్మీపేటకు చెందిన గొల్ల రంగస్వామి మంగళవారం మధ్యాహ్నం హెచ్. కైరవాడి గ్రామంలోని హంద్రీలో ట్రాక్టర్‌లోకి ఇసుకను లోడ్ చేసుకొని తరలిస్తుండగా పట్టుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని మంగంపల్లె స్టేజ్ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్ వెనుక పొలాల్లో మంగళవారం పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వెల్దుర్తి మండలానికి చెందిన ఇద్దరు, డోన్ మండలానికి చెందిన 9 మందిని అదుపులోకి తీసుకొని పేకముక్కలతోపాటు 11 సెల్ ఫోన్లు, 11 బైక్‌లు, రూ.92 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పలువురు పరారయ్యారని కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న రాజీనామాల పర్వం

- కృష్ణగిరి మండలంలో 108 మంది వలంటీర్ల రాజీనామా
- సేవలు వద్దనడంతో మనస్తాపం

కృష్ణగిరి: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న తమపై ప్రతిపక్ష టీడీపీ నాయకులు కక్షగట్టి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం దుర్మార్గమని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న 108 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను కృష్ణగిరి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మిదేవికి అందజేశారు. అనంతరం కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ కూటమికి తొత్తుగా మారిన నిమ్మగడ్డ రమేష్‌కుమార్ చౌదరి ద్వారా తమపై ఫిర్యాదు చేయించడంతోనే ఎన్నికల కమిషన్ తమ సేవలపై ఆంక్షలు విధించిందన్నారు. తమ సేవలు అడ్డుకుంటున్న చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్తారన్నారు.



కృష్ణగిరిలో రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

నిస్వార్థంగా సేవ చేశాం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసే అవకాశాన్ని కల్పించారు. తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందించాం. అవ్వాతాతలకు ప్రతి నెలా వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ ఇస్తుండటంతో వారు చూపే ఆప్యాయతతో ఆ కుటుంబాల్లో సభ్యురాలినైపోయాను. ఇప్పుడు చంద్రబాబు కుట్రల వల్ల వారికి సేవ చేసే భాగ్యం కోల్పోయాను. వలంటీర్ అనే పదవి అడ్డురావడంతో దానికి రాజీనామా చేశాను. ఇప్పుడు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటాను.

– సుద్దల లక్ష్మి, వలంటీర్, కృష్ణగిరి

పగబట్టి ఇబ్బంది పెట్టారు



వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతను ఎంతో నిస్వార్థంగా నిర్వర్తించాం. ప్రభుత్వంపై కక్షతో ప్రజలకు సేవలందిస్తున్న మాపై పగబట్టి ఇబ్బంది పెడుతున్నారు. వలంటీర్లను ఇబ్బంది పెడుతున్న వారికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. మేమ కూడా వారికి భయపడకుండా రాజీనామా చేశాం. సేవా చేసే వారిని అడ్డుకుంటే వారికి ఏమొస్తుంది.

– బిల్లా వెంకటేష్, వలంటీర్, ఆలంకొండ